సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం : 15 : అక్టోబర్ : 2022

I



పటిష్టంగా గిరిజన చట్టాలు

- రంపచోడవరం నూతన సబ్ కలెక్టర్ శుభం బన్సల్
- బాధ్యతలు స్వీకరణ

IIలో



స్పందన అర్జీలకు సత్వరమే పరిష్కారం

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- 85 వినతుల స్వీకరణ

IIలో

పాడేరులో భారీ వర్షం



సాక్షి,పాడేరు : జిల్లా కేంద్రమైన పాడేరుతో పాటు పలు ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



ఎలుగెత్తి.. జైకొట్టు..

మహోద్యమంలా నేడు 'విశాఖ గర్జన'

- వికేంద్రీకరణకు అన్ని వర్గాల నుంచి పెద్ద ఎత్తున మద్దతు
- జేఏసీ పిలుపు మేరకు ఉదయం 9 గంటలకు శాంతియుత ర్యాలీ
- అంబేద్కర్ విగ్రహం నుంచి బీచ్ రోడ్డులో వైఎస్సార్ విగ్రహం వరకు పాదయాత్ర
- విశాఖ పరిపాలన రాజధాని కోసం రాజకీయాలకు అతీతంగా భారీ ప్రదర్శన
- సుమారు లక్ష మంది పాల్గొనే అవకాశం
- ఉత్తరాంధ్ర వెనకబాటుతనాన్ని వివరిస్తూ.. సాంస్కృతిక ప్రదర్శనలు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్, చిత్రంలో ప్రొఫెసర్ లజపతిరాయ్, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, అవంతి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, జేఏసీ సభ్యులు శివశంకర్, కో కన్వీనర్ దేముడు మాస్టారు, పైలా కృష్ణప్రసాద్, మంత్రి రాజశేఖర్, ప్రొఫెసర్ బాలమోహన్‌దాస్, శోభశ్రీ, రొంగలి జగన్నాథం, ప్రొఫెసర్ షారోన్‌రాజు తదితరులు

సాక్షి, విశాఖపట్నం:

మూడు రాజధానుల కోసం ఉత్తరాంధ్ర ప్రజలు కదం తొక్కనున్నారు. విశాఖను పరిపాలన రాజధానిగా చేయాలంటూ వేల గొంతుకలు ఒక్కటై నినదించనున్నాయి. వికేంద్రీకరణతోనే ఉత్తరాంధ్ర వెనుకబాటు నుంచి విముక్తి అంటూ అన్ని వర్గాల వారు ఒకతాటిపైకి వచ్చి గర్జించనున్నారు. పరిపాలన వికేంద్రీకరణకు మద్దతుగా ఉత్తరాంధ్ర నాన్ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం చేపడుతున్న 'విశాఖ గర్జన' మహోద్యమంలా సాగనుంది. గర్జన ర్యాలీకి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం ఉత్తరాంధ్ర నాన్‌పొలిటికల్ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ లజపతిరాయ్, మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తోపాటు పలువురు జేఏసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, మేధావులు ర్యాలీ జరిగే రూట్‌మ్యాప్‌ను పరిశీలించారు. అనంతరం జేఏసీ ఆధ్వర్యంలో 'విశాఖ గర్జన' జెండాను, పాటను ఆవిష్కరించారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో 'విశాఖ గర్జన' జెర్సీలను వైఎస్సార్‌సీపీ ఉమ్మడి విశాఖ జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి ఆవిష్కరించారు. నియోజకవర్గాల వారీ రూట్‌మ్యాప్‌ను పోలీసులకు అందజేశారు. ఉత్తరాంధ్రలో 6 జిల్లాల నుంచి ప్రజలు భారీగా తరలిరానున్న నేపథ్యంలో ఆయా నియోజకవర్గాలవారీగా వలంటీర్లను కూడా ఏర్పాటు చేశారు. యాత్రలో పాల్గొనేవారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. 1,038 మంది పోలీసులు, 6 స్పెషల్ పార్టీలు, 3 ఏపీఎస్పీ బెటాలియన్‌తో భారీ బందోబస్తు కూడా ఏర్పాటు చేశారు.



ఏర్పాట్లపై మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

సుమారు లక్షమందితో ర్యాలీ

ఉత్తరాంధ్రవాసులు మూడు రాజధానులకు మద్దతుగా 'మన విశాఖ- మన రాజధాని' అని శాంతియుతంగా మూడున్నర కిలోమీటర్ల మేర జరిపే ర్యాలీలో సుమారు లక్షమంది పాల్గొనున్నారు. ఉత్తరాంధ్రలోని 6 జిల్లాల నలుమూలల నుంచి రాజకీయాలకు అతీతంగా ప్రజలు పెద్దసంఖ్యలో విశాఖ చేరుకుంటున్నారు. అమరావతి ఏకీకృత రాజధాని పేరిట రైతుల ముసుగులో టీడీపీ అమరావతి నుంచి అరసవల్లి వరకు చేపడుతున్న పాదయాత్రను వ్యతిరేకిస్తూ.. ఉత్తరాంధ్ర ప్రాంత మేధావులు, ఉద్యోగులు, విద్యార్థులు, వర్తకులు, వ్యాపారస్తులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, న్యాయవాదులు, కుల సంఘాలతో పాటు అన్ని వర్గాల ప్రజలూ శాంతియుతంగా నిరసన తెలియజేయడానికి సన్నద్ధమయ్యారు. మూడున్నర కిలోమీటర్ల మేర ర్యాలీ జరగనుంది.

గర్జన ఇలా...

సమయం : ఉదయం 9 గంటల నుంచి...

ప్రారంభ స్థలి : ఎల్ఐసీ బిల్డింగ్ వద్ద డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహం

మొత్తం కిలోమీటర్లు : సుమారు 3.5 కి.మీ

ఏయే ప్రాంతాలు : జైల్ రోడ్డు జంక్షన్, సెవెన్‌హిల్స్ ఆస్పత్రి, వాల్తేరు క్లబ్, సిరిపురం జంక్షన్, చినవాల్తేర్ జంక్షన్, ఆర్కే బీచ్ వైఎస్సార్ విగ్రహం వరకు..

బందోబస్తు : 1,100 మంది పోలీసులు, 15 రోప్ పార్టీలు, 6 స్పెషల్ పార్టీలు, 3 ఏపీఎస్పీ ప్లటూన్లు

ఇదే సరైన సమయం

- ఇప్పుడు గర్జించకపోతే భావితరాలకు తీరని అన్యాయం
- రాజకీయాలకు అతీతంగా భాగస్వాములు కండి
- ఉత్తరాంధ్ర వాసులకు జేఏసీ ప్రతినిధుల పిలుపు

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): 'స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లయింది. ఇప్పటికీ ఉత్తరాంధ్ర జిల్లాలు అత్యంత వెనుకబడి ఉన్నాయి. ఇప్పటికైనా గర్జించకపోతే భావితరాలకు మనం అన్యాయం చేసిన వారమవుతాం. వికేంద్రీకరణకు మద్దతుగా.. విశాఖను పరిపాలన రాజధాని చేయాలని కోరుతూ శనివారం నిర్వహిస్తున్న విశాఖ గర్జనకు రాజకీయాలకు అతీతంగా ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలి.'అని నాన్ పొలిటికల్ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ లజపతిరాయ్ పిలుపునిచ్చారు. నగరంలోని ఓ హోటల్‌లో శుక్రవారం విశాఖ గర్జనకు సంబంధించిన జెండా, పాటను జేఏసీ ప్రతినిధులు, పలువురు రాజకీయ నాయకుల సమక్షంలో ఆవిష్కరించారు. 'ఉత్తరాంధ్ర అభివృద్ధికి విశాఖను పరిపాలన రాజధానిగా నిర్ణయించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మనమంతా కృతజ్ఞతలు చెప్పాలి. ఎందుకంటే.. రాష్ట్ర విభజన సమయంలో వచ్చిన అవకాశాన్ని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నీరుగార్చారు. స్వార్థ రాజకీయాల కోసం అమరావతినే రాజధానిగా ప్రకటించి ఉత్తరాంధ్ర ప్రజలకు తీరని అన్యాయం చేశారు. ఇప్పుడు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత ఉత్తరాంధ్ర గడ్డపై జన్మించిన ప్రతి ఒక్కరిపై ఉంది రాజకీయాలను పక్కన పెట్టి సామాజిక దృక్పథంతో అందరూ ఆలోచించాలి. విశాఖ గర్జనకు ఏ రాజకీయ పార్టీ అడ్డుపడకుండా సహకరించాలి.'అని ప్రొఫెసర్ లజపతిరాయ్ విజ్ఞప్తి చేశారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధి, భవిష్యత్ తరాల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయానికి ఈ ప్రాంత ప్రజలు మద్దతు పలకాలని కోరారు. వైఎస్సార్‌సీపీ విశాఖ అధ్యక్షుడు ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ వచ్చిన అవకాశాన్ని వినియోగించుకోకపోతే మరో 25 ఏళ్లలో మరో ఉద్యమం తప్పదన్నారు. కేంద్రీకరణ వల్ల ఇప్పటికే చాలా నష్టపోయామని.. వికేంద్రీకరణకు మద్దతుగా విశాఖ గర్జనకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. ఒక్క విశాఖనే గాక అమరావతిని శాసన రాజధానిగా ప్రకటించిన విషయాన్ని గ్రహించాలన్నారు. అమరావతి రైతులు పాదయాత్రను విరమించుకోవాలని.. మూడు ప్రాంతాల ప్రజలందరం అన్నదమ్ములుగా కలిసి ఉందామన్నారు. చోడవరం ఎమ్మెల్యే ధర్మశ్రీ మాట్లాడుతూ శుక్రవారం ఉదయం నగరంలో తేలికపాటి వర్షం కురిస్తే.. టీడీపీ, తోక పార్టీలు శునకానందం పొందడం విడ్డూరంగా ఉందన్నారు. వర్షం వచ్చినా.. ఇంకేం వచ్చినా విశాఖగర్జన సాగుతుందన్నారు. విశాఖ గర్జనను వ్యతిరేకించిన ఎవరైనా చరిత్రహీనులుగా మిగిలిపోవడం ఖాయమన్నారు. ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ విశాఖ గర్జనకు తరలి రావాలన్నారు. జేఏసీ సభ్యుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ విశాఖ గర్జన విజయవంతం చేయాల్సిన బాధ్యత ఈ ప్రాంత వాసులుగా అందరిపై ఉందన్నారు. మరో సభ్యుడు ఎస్ఎస్ శివశంకర్ మాట్లాడుతూ గర్జనకు రాష్ట్రవ్యాప్తంగా మద్దతు వస్తోందన్నారు. రాయలసీమతో పాటు మధ్యాంధ్రప్రదేశ్ నుంచి కూడా మద్దతు రావడం విశేషమన్నారు. కొయ్య ప్రసాద రెడ్డి మాట్లాడుతూ పచ్చ మీడియాకు ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలు పట్టడం లేదన్నారు. ప్రొఫెసర్ పాల్ మాట్లాడుతూ రేపటితరం భవిష్యత్‌కు క్యాపిటల్ సిటీ రావాల్సిందేనన్నారు. కార్యక్రమంలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, జేఏసీ సభ్యులు ప్రొఫెసర్ బాల మోహన్ దాస్, ప్రొఫెసర్ కొల్లూరి సూర్యనారాయణ, జేఏసీ కో కన్వీనర్ దేముడు మాస్టార్, ప్రొఫెసర్ షరన్, ప్రొఫెసర్ పాల్, డాక్టర్ పి.రామారావు, పైలా కృష్ణమోహన్, మంత్రి రాజశేఖర్, శోభశ్రీ, కె.ఈశ్వరరావు, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

వికేంద్రీకరణతోనే అన్ని ప్రాంతాల అభివృద్ధి

- విశాఖ గర్జనకు భారీగా తరలి రావాలి
- అరకు ఎంపీ మాధవి



కొయ్యూరు: వికేంద్రీకరణ ద్వారానే రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధి సాధ్యమని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి అన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జేఏసీ ఆధ్వర్యంలో విశాఖలో శనివారం నిర్వహించనున్న గర్జన కార్యక్రమానికి విధిగా అన్ని వర్గాల ప్రజలు రాజకీయాలను పక్కన పెట్టి పాల్గొనాలని కోరారు. భావితరాల భవిష్యత్తు బాగుండాలంటే విశాఖను పరిపాలన రాజధానిగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. దీని మూలంగా ఈ ప్రాంత ప్రజలకు అనేక అవకాశాలు ఉంటాయన్నారు. ఉత్తరాంధ్ర ఆదినుంచి వెనుకబాటుకు గురైందన్నారు. అమరావతి పేరిట చంద్రబాబు మొత్తం సొమ్మును తీసుకెళ్లి ఒకచోటనే పెట్టడంవల్ల ఎలాంటి ఉపయోగం లేదన్నారు. కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటు చేయాలన్నారు. విశాఖలో నిర్వహించే గర్జనకు అరకు పార్లమెంట్ నుంచి అధిక సంఖ్యలో గిరిజనులు తరలిరావాలని ఆమె కోరారు.

మే నుంచి ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డి
- కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం



మాట్లాడుతున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి

సాక్షి, పాడేరు: వచ్చే ఏడాది మే నెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేస్తామని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్. విజయ్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రం పాడేరు కలెక్టరేట్ సమావేశమందిరంలో శుక్రవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పిల్లలకు బలమైన ఆహారం లక్ష్యంగా ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ప్రతి కిలోకు 50 గ్రాముల చొప్పున పంపిణీ చేస్తున్నామన్నారు. గత రెండు రోజులుగా అనంతగిరి. అరకులోయ, డుంబ్రిగుడ, హుకుంపేట, పాడేరు మండలాల్లో 30 కేంద్రాలను తనిఖీ చేసినట్టు చెప్పారు. జీసీసీ ఎంఎల్ఎస్ పాయింట్లు, డీఆర్ డిపోలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సంచార పంపిణీ వాహనాలు, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో జరిపిన తనిఖీల్లో పలు లోపాలను గుర్తించామన్నారు. పనితీరు మెరుగుకు పలు సూచనలు ఇచ్చామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 366 కేంద్రాల్లో క్షేత్రస్థాయి పర్యటనలు, తనిఖీలు చేపట్టి కొన్ని కేంద్రాల నిర్వాహకులపై చర్యలు కూడా తీసుకున్నామన్నారు. నాణ్యత లోపిస్తే కమిషన్ ఉపేక్షించదని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అంగన్‌వాడీ వర్కర్లలో అనేకమంది నిరక్షరాస్యత కారణంగా కొన్ని కేంద్రాల్లో తగిన న్యాయం జరగడం లేదని గుర్తించామన్నారు. అలాంటి కేంద్రాల బలోపేతానికి అధికారులు దృష్టి సారించాలన్నారు. సీడీపీవోలు అంగన్‌వాడీ కేంద్రాలను తప్పనిసరిగా తనిఖీలు చేపట్టాలని, మధ్యాహ్న మెనూను కచ్చితంగా ఆమలుచేయాలని ఆదేశించారు. ఇటీవల పాడేరు కేజీబీవీ విద్యార్థినులకు ఆహారం సరిగా అందించక పోవడం వల్ల ధర్నా చేసినట్టు తమకు సమాచారం వచ్చిందన్నారు. విద్యాలయాల్లో ఆహార పంపిణీలో నాణ్యత, పరిమాణంలో తేడాలుంటే విద్యార్థులు తన నంబరు (9400551117)కు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. జాతీయ స్థాయిలో ఏపీ ఫుడ్ కమిషన్ మూడవ స్థానంలో ఉందని, మొదటి స్థానం సాధించే లక్ష్యంలో అధికారులంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వి.అభిషేక్, పౌరసరఫరాల ఉపసంచాలకులు సురేష్, జిల్లా అధికారి శివ ప్రసాద్, జిల్లా మేనేజర్ గణేష్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, డీఈవో డాక్టర్ రమేష్, డీఎంహెచ్‌వో డాక్టర్ బి.సుజాత, పాడేరు, చింతపల్లి జీసీసీ డీఎంలు కె.పార్వతమ్మ, సింహాచలం, ఏటీడబ్ల్యూవో రజిని, సీడీపీవోలు, ఎంఈవోలు పాల్గొన్నారు.

21న మారేడుమిల్లిలో మెగా జాబ్‌మేళా

సాక్షి,పాడేరు : రంపచోడవరం డివిజన్ పరిధిలోని మారేడుమిల్లి యూత్ శిక్షణ కేంద్రంలో ఈ నెల 21న నిర్వహించే మెగా జాబ్‌మేళాను గిరిజన నిరుద్యోగ యువత అంతా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ కోరారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళా పోస్టర్‌ను శుక్రవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, డిప్లమో అభ్యర్థులంతా ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వరుణ్ మోటార్స్, అమర్ రాజా బ్యాటరీస్, ముత్తూట్ ఫైనాన్స్ తదితర 16 సంస్థల్లో ఉద్యోగాల భర్తీకి గాను ఆయా సంస్థల ప్రతినిధులంతా జాబ్‌మేళాకు హాజరవుతున్నారన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు ఇస్తారని ఆయన వివరించారు. డీఆర్వో బి.దయానిధి, ఐటీడీఏ ఏపీవో వీఎస్ ప్రభాకరరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ మేనేజర్ రోహిణి, కోఆర్డినేటర్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

బీఈడీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

అర్హులైన గిరి అభ్యర్థులకు డీడీ సూచన

రంపచోడవరం: ఏజెన్సీలోని డిగ్రీ ఉత్తీర్ణులైన గిరిజన అభ్యర్థులు భద్రాచలంలోని బీఈడీ కళాశాలలో ప్రవేశానికి నేరుగా దరఖాస్తు చేసుకోవాలని గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. ఏపీ, తెలంగాణకు చెందిన అభ్యర్థులని తెలిపారు. డిగ్రీలో కనీసం 40శాం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈ ప్రాంతంలోని అభ్యర్థులు రంపచోడవరం ఐటీడీఏ, డీడీ కార్యాలయాల్లో దరఖాస్తులు ఉచితంగా పొందవచ్చన్నారు. దరఖాస్తులను పంపేందుకు ఈ నెల 26 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. పూర్తి మెరిట్ ఆధారంగా ఎంపిక జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ఏపీ పీజీ సీఈటీలో సుప్రజ సత్యకు 48వ ర్యాంకు

బీసీ డీ కేటగిరిలో ఆరో ర్యాంకు



కొయ్యూరు : కడప యోగి వేమన యూనివర్సిటీ శుక్రవారం విడుదల చేసిన ఏపీ పీజీ కామన్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఆడాకులకు చెందిన కూనిశెట్టి సుప్రజ సత్య ఓపెన్ కేటగిరిలో 48, బీసీడీ కేటగిరిలో ఆరో ర్యాంకు సాధించారు. మహిళా విభాగంలో 39వ ర్యాంకును సాధించారు. ఎమ్మెస్సీ బయో కెమిస్ట్రీ సబ్జెక్టులో పరీక్ష రాశారు. ఆమెను తండ్రి రాంబాబు,సర్పంచ్ అప్పారావు,గ్రామస్తులు అభినందించారు. ఈ సందర్భంగా తండ్రి మాట్లాడుతూ సుప్రజ చిన్నతనం నుంచి చదువుపై మంచి శ్రద్ధపెట్టిందన్నారు. పదిలో 10/10జీపీఏ, డిగ్రీలో 9.8 సాధించిందని ఆయన చెప్పారు.

అల్లూరి పోరాట ప్రాంతాల అభివృద్ధి

- రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి
- అడ్డతీగల పోలీసుస్టేషన్‌పై దాడి చేసి నేటికి వందేళ్లు
- ఆయన విగ్రహం వద్ద ఘన నివాళి



అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి

అడ్డతీగల: స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పోరాట ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. అడ్డతీగల పాత పోలీస్‌స్టేషన్‌పై అల్లూరి స్వాతంత్ర పోరాట సమయంలో దాడిచేసి శనివారం నాటికి వందేళ్లు పూర్తి అవుతోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం నాటి వాస్తవ పోలీస్‌స్టేషన్ ఎదుట అల్లూరి విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అల్లూరి నాడు దాడిచేసిన అడ్డతీగలలోని వాస్తవ పోలీస్‌స్టేషన్‌తో పాటు అప్పట్లో అల్లూరి నివాసం ఉండి పోరాటానికి ప్రధాన కేంద్రమైన అడ్డతీగల మండలం పైడిపుట్ట గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జాతీయ అల్లూరి యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు మాట్లాడుతూ పాత పోలీస్‌స్టేషన్ ప్రాంతాన్ని ప్రత్యేకంగా అల్లూరి స్మారక పార్కుగా అభివృద్ధి చేయాలని ఆయన కోరారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువా కప్పి జ్ఞాపికను అందించి సత్కరించారు. ఎస్ఐ అప్పలరాజు, సర్పంచ్ పప్పుల చిట్టమ్మ పాల్గొన్నారు.

పశువైద్యుల సంఘ జిల్లా నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న సభ్యులు

పాడేరు రూరల్ : గ్రామీణ పశువైద్యుల సంఘం జిల్లా కార్యవర్గాన్ని శుక్రవారం పాడేరులోని పశుసంవర్ధక శాఖ ప్రధాన కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ సాగిరి గణేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా డాక్టర్ కె. శీనయ్య, డాక్టర్ కె. చరణ్, కార్యదర్శిగా డాక్టర్ కె. రాజేష్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ బి.రవి, డాక్టర్ పి. మాధవీలత, డాక్టర్ ఎస్. చాలిని, కోశాధికారిగా డాక్టర్ వి.వి. సతీష్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా డాక్టర్ కె. వరప్రసాద్, డాక్టర్ పి. నరేష్, సీహెచ్.తరుణ్‌కుమార్‌లను ఎన్నుకున్నారు.

మద్యం, జూదం నిషేధిస్తూ తీర్మానం



సర్పంచ్ రమేష్ ఆధ్వర్యంలో తీర్మానం చేస్తున్న గ్రామస్తులు

సుజనకోట గ్రామస్తుల ఆదర్శం

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోటలో శుక్రవారం మద్యం, జూదం జోలికిపోకుండా గ్రామస్తులు పోలీసులు సమక్షంలో తీర్మానం చేశారు.ఈ కార్యక్రమానికి సర్పంచ్ వి.రమేష్ ఆధ్వర్యం వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మద్యం, జూదం వల్ల చాలా కుటుంబాలు చిన్నాభిన్నం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ మద్యం సేవించి అనారోగ్యానికి గురై ప్రాణాలు కోల్పోయారని, జూదం వల్ల ఉన్నదంతా పోగొట్టుకుని కుటుంబాలు వీధిన పడుతున్నాయన్నారు. అందువల్లనే గ్రామస్తులంతా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సమష్టిగా తీర్మానం చేయడం శుభసూచకమన్నారు. ఈ మేరకు తీర్మానాన్ని ఏఎస్ఐ తిరుపతిరావు,మహిళ పోలీసు శైలకు సర్పంచ్, గ్రామస్తులు అందజేశారు.

పటిష్టంగా గిరిజనుల చట్టాలు: సబ్ కలెక్టర్

రంపచోడవరం: స్థానిక సబ్ కలెక్టర్‌గా శుభం బన్సల్ శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. 2022 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఈయన ఢిల్లీలో అసిస్టెంట్ కలెక్టర్‌గా శిక్షణ పొందారు. అనంతరం రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గిరిజనుల చట్టాల అమలుకు పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. 1/70 చట్టం , మ్యుటేషన్ల అమలుపై దృష్టిసారిస్తామన్నారు. రాజమహేంద్రవరం–విజయనగరం హైవే నిర్మాణంలో ఇళ్లు కోల్పోతున్న వారికి భూసేకరణ చట్టం 2013 ప్రకారం నష్టపరిహారం అందిస్తామన్నారు. ఆర్‌వోఎఫ్‌ఆర్ చట్టం ద్వారా గిరిజనులకు పట్టాలు అందజేస్తామన్నారు. పోలవరం ముంపు బాధితులకు ఆర్‌అండ్‌ఆర్ నిబంధనల ప్రకారం చెల్లిస్తామన్నారు. సబ్ కలెక్టర్‌ను రెవెన్యూ అసోసియేషన్ సభ్యులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. తహసీల్దార్ పీఎస్‌వీ ప్రసాద్, ఏవో సావిత్రి, డీటీ పాదిలి వెంకటేశ్వరులు, ఎంపీవీ సత్యనారాయణ, శ్రీధర్ పాల్గొన్నారు.

పాఠశాలకు వెళ్లాలంటే.. సాహసం చేయాల్సిందే!

- ప్రతిరోజూ గెడ్డ దాటించాల్సిందే
- బూసుపల్లి వాసుల ఆవేదన

జి.మాడుగుల: పాఠశాలకు వెళ్లాలంటే ప్రతీ రోజు బూసుపల్లి విద్యార్థులు సాహసం చేయాల్సిందే. మండలంలో వంజరి పంచాయతీ బూసుపల్లి నుంచి కృష్ణాపురం పాఠశాలకు వెళ్లాలంటే విద్యార్థులు ప్రమాదకరమైన గెడ్డను దాటాలి. వారితో పాటు తల్లిదండ్రులు కూడా సాహసం తప్పడం లేదు. కృష్ణాపురం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో బూసుపల్లి గ్రామం ఉంది. ఈ గ్రామంలో పాఠశాల లేకపోవడంతో సుమారు 50 మంది విద్యార్థులు కృష్ణాపురం పాఠశాలలో చదువుతున్నారు. ఈ గ్రామాల మధ్య తాజంగి జలాశయానికి నీరు వచ్చే పెద్దగెడ్డ ఉంది. బూసుపల్లి గ్రామం నుంచి పాఠశాలకు రావాలంటే ఈ గెడ్డను దాటాలి. గత కొన్ని రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు బూసుపల్లి గ్రామసమీపంలోని గెడ్డ వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తుండటంతో విద్యార్థులకు పెద్ద సమస్యగా మారిందని గ్రామస్తులు తెలిపారు. బూసుపల్లి– కృష్ణాపురం గ్రామాల మధ్య నడులోతున ప్రవహిస్తున్న గెడ్డను శుక్రవారం విద్యార్థులను, తల్లిదండ్రులు, గ్రామస్తులు దాటించారు. గ్రామాల మధ్య గెడ్డపై బ్రిడ్జి నిర్మించాలని, బూసుపల్లి గ్రామంలో పాఠశాలను ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీటీసీ కొర్రా రాజుబాబు, గ్రామ పెద్దలు జె రాంబాబు, పాంగి లక్ష్మణరావు, కిల్లో అర్జున్ కోరారు.


పిల్లలను గెడ్డను దాటిస్తున్న తల్లిదండ్రులు

వ్యవసాయ గణన త్వరితగతిన పూర్తి

- డిసెంబర్ 31 వరకు గడువు
- జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి మురళీ కృష్ణ ఆదేశం


రెవెన్యూ అధికారులకు సూచనలిస్తున్న మురళీ కృష్ణ

రాజవొమ్మంగి: వ్యవసాయ కమతాల గణన డిసెంబర్ 31 కల్లా పూర్తి చేయాలని జిల్లా ముఖ్యప్రణాళిక అధికారి మురళీకృష్ణ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయగణనపై వీఆర్వోలకు ఆయన శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ గణన ఆధారంగానే దేశవ్యాప్తంగా సంక్షేమ పథకాలు అమలు అవుతాయన్నారు. జాతీయస్థాయిలో ఆర్థిక సామాజిక అభివృద్ధిని నిర్ధారించాలంటే 11వ గణన త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ గణన పూర్తి స్థాయిలో జరిగినప్పుడే రైతులకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. డిజిటల్ విధానంలో వ్యవసాయ గణన పూర్తి చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందన్నారు. దీనిలో భాగంగా మండలాల వారీగా గణాంక అధికారులకు (ఆర్ఐలు, వీఆర్వోలు, రెవెన్యూ అధికారులు, వ్యవసాయశాఖ సిబ్బంది) శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం పూర్తికాగానే వ్యవసాయ కమతాల గణన ప్రారంభం అవుతుందన్నారు. పదో వ్యవసాయ గణన 2015–16లో జరిగిందని, 11వ గణన 2020–21లో జరగాల్సి ఉందన్నారు. అనివార్య కారణాల వల్ల రెండేళ్లపాటు వాయిదా పడిందన్నారు. చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతుల వివరాలు సేకరించి నమోదు చేస్తామన్నారు. తహసీల్దార్ వైవీ సుబ్రహ్మణ్యాచారి, డీఎస్‌వో మురళీకృష్ణ, ఏఎస్‌వో చైతన్య, డీటీ సత్యనారాయణ పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు సత్వరమే పరిష్కారం

కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: స్పందనలో స్వీకరించిన గిరిజనుల అర్జీలను సత్వరమే పరిష్కరిస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం పాడేరు ఐటీడీఏలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అనేక గ్రామాల నుంచి వచ్చిన గిరిజనులు సమస్యలను కలెక్టర్ తెలుసుకున్నారు. మొత్తం 85 వినతులను స్వీకరించారు. వాటిని వెంటనే పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. జి.మాడుగులకు చెందిన కూంతురు రాధమ్మ 2022కు సంబంధించి అమ్మఒడి నగదు తన ఖాతాలో జమకాలేదని, పెదలువ్వాసింగికి చెందిన కోరాబు బొంజునాయుడు అనే దివ్యాంగుడు రేషన్‌కార్డు, పింఛన్ సౌకర్యాలను కల్పించాలని, వంతాల పంచాయతీ సిరిపురం గ్రామస్తులు సుబ్బారావు, రంభో, గాంధీనగరానికి చెందిన పాంగి పూలు, పాంగి చందులు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు మంజూరు చేయాలని, సాలబం కాలనీలో మినీ అంగన్వాడీ కేంద్రం మంజూరు చేయాలని కుడుముల ఆదిలక్ష్మి, జి.కె.వీధి మండలం సంకాడకు చెందిన సోమలింగం జాతీయ రహదారి నిర్మాణంలో తన భూమిని కోల్పోతున్నానని నష్ట పరిహారం చెల్లించాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో డీఆర్వో దయానిధి, ఐటీడీఏ ఏపీవో వి.ఎస్.ప్రభాకరరావు, గిరిజన సంక్షేమ ఈఈ డీవీఆర్ఎం.రాజు, పంచాయతీరాజ్ శాఖ ఈఈలు కొండయ్యపడాల్, లావణ్యకుమార్, జిల్లా వ్యవసాయాధికారి నందు, జిల్లా, డివిజనల్ పంచాయతీ అధికారులు కొండలరావు, కుమార్ పాల్గొన్నారు.

భాషా వలంటీర్లు దీక్షల విరమణ

సాక్షి,పాడేరు: ఉద్యోగాలు కొనసాగించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఐటీడీఏ ఎదుట రిలే దీక్షలు చేపట్టిన భాషా వలంటీర్లు కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవోల హామీతో శుక్రవారం ఆందోళనను విరమించారు. ఇన్‌చార్జి పీవో, సబ్‌కలెక్టర్ వి.అభిషేక్, గిరిజన సంఘం నేత అప్పలనరస, భాషా వలంటీర్ల సంఘం నేతలు శ్రీను, నరసయ్య, కుమారి తదితరులు గురువారం రాత్రి కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో చర్చలు జరిపారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో మంజూరైన రూ.1.89 కోట్లు సర్వశిక్షాభియాన్ నుంచి ఐటీడీఏ పీవో ఖాతాకు బదిలీ అయిన వెంటనే 24 గంటల్లో భాషావలంటీర్ల నియామకపు పత్రాలు జారీ చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. గౌరవ వేతన బకాయి సమస్య లేకుండా 780 మంది మాతృ భాషా వలంటీర్లకు రూ. 5 వేల చొప్పున ముందస్తుగా వారి ఖాతాల్లో జమచేయాలని ఇన్‌చార్జి పీవో అభిషేక్‌ను కలెక్టర్ ఆదేశించారు.కలెక్టర్ హామీతో భాషా వలంటీర్లంతా తమ ఆందోళనను విరమించేందుకు సమ్మతించారు. ఆందోళన చేస్తున్న భాషా వలంటీర్ల సంఘ నేతలకు శుక్రవారం ఇన్‌చార్జి పీవో అభిషేక్ నిమ్మకాయ రసం ఇచ్చి రిలే దీక్షలను విరమింపజేశారు.


భాషా వలంటీర్లకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేస్తున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అభిషేక్

ఆశా కార్యకర్తల సంఘ జిల్లా కార్యవర్గం

పాడేరు రూరల్ : ఆశా కార్యకర్తల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం పాడేరులో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జిల్లా అధ్యక్షురాలిగా లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా మంగమ్మ, కోశాధికారిగా కొండమ్మ, ఉపాధ్యక్షులుగా కృష్ణకుమారి, కిల్లో పార్వతి, దాసమ్మ, కన్నమ్మ, సహాయ కార్యదర్శులుగా జి. ధనలక్ష్మి, సుబ్బాలమ్మ, విజయ, ముత్యాలమ్మ, మరో 10 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోమంగి చిన్నయ్య పడాల్ తదితరులు పాల్గొన్నారు.


లక్ష్మి, మంగమ్మ

గిరిజన ఆశ్రమాల్లో రాత్రి బస

సాక్షి,పాడేరు : ప్రభుత్వం ఆదేశాల మేరకు పాడేరు, చింతూరు, రంపచోడవరం ఐటీడీఏల పరిధిలోని అన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో అధికారులు రాత్రి బస కార్యక్రమానికి శుక్రవారం శ్రీకారం చుట్టారు. మహిళా అధికారులు బాలికల ఆశ్రమ పాఠశాలల్లోను, ఇతర అధికారులు బాలుర ఆశ్రమ పాఠశాలలకు చేరుకుని విద్యార్థులతో కలిసి రాత్రి భోజనం చేశారు. ఆయా పాఠశాలల్లో పనితీరును సమీక్షిస్తునే విద్యార్థుల యోగక్షేమాలు కూడా తెలుసుకుంటారు. మండలంలోని గుత్తులపుట్టు బాలికల ఆశ్రమ పాఠశాలలో ఏటీడబ్ల్యూవో ఎల్.రజిని రాత్రి బస చేశారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు.

నిండు గర్భిణికి నడక కష్టాలు

అధ్వాన రహదారితో అవస్థలు

అనంతగిరి: అసలే రహదారి సౌకర్యం అంతంతమాత్రం.. దీంతోపాటుగా రెండు వారాలుగా కురిసిన భారీ వర్షాలకు మరింత అధ్వానంగా మారడంతో ఓ నిండు గర్భిణి శుక్రవారం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. మండలంలోని కొండిబ పంచాయతీ కపటివలస గ్రామానికి చెందిన కొర్రా రుపాలమ్మ రెండో కాన్పులో నెలల నిండి పురిటినొప్పులు వస్తుండడంతో కుటుంబ సభ్యులు అంబులెన్స్‌కు సమాచారం అందించారు. గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా మారడంతో అంబులెన్స్ వచ్చే పరిస్థితి లేదు. దీంతో సుమారు మూడు కిలోమీటర్ల మేర ఆమె కుటుంబ సభ్యులు సాయంతో నడుచుకుంటూ షాడ జంక్షన్‌కు చేరుకుంది. అక్కడ నుంచి అనంతగిరి పీహెచ్‌సీకి అంబులెన్స్‌లో ఆమెను తరలించారు. రహదారి సౌకర్యం లేకపోవడంతో అనారోగ్యానికి గురైతే డోలీమోతలపై తరలించాల్సిన పరిస్థితి నెలకొందని, అధికారులు స్పందించి రహదారి సౌకర్యానికి నిధులు మంజూరు చేయాలని కపటివలస గ్రామస్తులు కోరుతున్నారు.


రహదారి అధ్వానంగా మారడంతో ఆస్పత్రికి నడుచుకుంటూ వస్తున్న గర్భిణి

క్లుప్తంగా

దోమల నివారణతో మలేరియా, డెంగ్యూ దూరం



మలేరియాపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కొయ్యూరు: దోమలను నివారిస్తే మలేరియా, డెంగ్యూ వ్యాధులు రాకుండా ఉంటాయని సహాయ మలేరియా అధికారి(ఏఎంవో) సత్యనారాయణ సూచించారు. గృహిణులు ఇంటి వద్ద నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని కోరారు. వెలగలపాలెం సచివాలయం పరిధిలో ఆయన శుక్రవారం పర్యటించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉంటే, లార్వా పెరిగి దోమల వృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. దోమ తెరలను వాడాలన్నారు. హెల్త్ అసిస్టెంట్ వెంకన్న, ఎంఎల్‌హెచ్‌పీ రేవతి, సర్పంచ్ రత్నం, సతీష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

10 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

రాజవొమ్మంగి: మొల్లిమెట్ల గ్రామ శివారు అటవీ ప్రాంతంలో సారా తయారు చేస్తున్న దూసరపాముకు చెందిన దమ్ము దుర్గయ్యను అరెస్టు చేశామని ఎస్సై గోపీనరేంద్ర ప్రసాద్ శుక్రవారం తెలిపారు. అతని నుంచి 10 లీటర్ల సారాతోపాటు సామగ్రి స్వాధీనం చేసుకున్నామన్నారు. సారా బట్టీ వద్ద 50 లీటర్ల బెల్లం ఊట లభ్యమైందన్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని అడ్డతీగల జేఎఫ్‌సీ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచామన్నారు.

86 పశువులకు టీకాలు



పశువులకు టీకాలను వేస్తున్న పశువైద్య సిబ్బంది

అనంతగిరి: లంపీ స్కిన్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని కాశీపట్నం పశువైద్యాధికారి గణేశ్వరరావు తెలిపారు. పెదకోట పంచాయతీ కొండిబకోటలో శుక్రవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. వ్యాధి బారిన పడిన 86 పశువులకు టీకాలు వేశారు. పశువుల వ్యాధులకు గురైతే పశువైద్య సిబ్బందికి సమాచారం అందించాలని గిరిజనులకు సూచించారు.

పైపులైన్ లీకులు సరిచేసిన సర్పంచ్



వాటర్ ట్యాంకు వద్ద పైపులైన్ లీకులు అరికడుతున్న సర్పంచ్ నాగేశ్వర్రావు

రాజవొమ్మంగి: చెరకుంపాలెంలో రక్షిత ట్యాంకు మరమ్మతులకు గురైంది. మెకానిక్ సిబ్బంది కోసం ఎదురు చూడకుండా స్వయంగా సర్పంచ్ దాసరి నాగేశ్వర్రావు బాగు చేశారు. పైపులైన్ల నుంచి పలుచోట్ల లీకులు ఏర్పడి నీరు వృథాగా పోతున్నట్లు శుక్రవారం ఆయన గుర్తించి తానే స్వయంగా రంగంలోకి దిగి పరిస్థితిని చక్కదిద్దారు. స్థానికులు అభినందించారు.

మూడు వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ చేస్తున్న ఎంపీడీవో

కొయ్యూరు: ఖాళీగా ఉన్న మూడు వలంటీర్ పోస్టుల భర్తీకి ఎంపీడీవో మేరీరోజ్ తన కార్యాలయంలో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆన్‌లైన్‌లో 12 మంది దరఖాస్తు చేసుకోగా, ఏడుగురు మాత్రమే హాజరయ్యారు. అంతాడ నుంచి ఒక్కరే దరఖాస్తు చేయడంతో అతడికే ఖాయం చేశారు. కంఠారం నుంచి ఇద్దరు దరఖాస్తు చేస్తే ఒక్కరు హాజరయ్యారు. శరభన్నపాలెం నుంచి ఎనిమిది మంది దరఖాస్తు చేస్తే ఐదుగురు హాజరయ్యారు. ఫలితాలను ఒకట్రెండు రోజుల్లో ప్రకటిస్తామని ఎంపీడీవో తెలిపారు. రాజేంద్రపాలెం కార్యదర్శి పి రాము, సంక్షేమ సహాయకుడు రాజుబాబు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించటమే లక్ష్యం

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

జి.మాడుగుల: ప్రజా సమస్యలను పరిష్కరించటం, ప్రతీ గడపకు సంక్షేమ ఫలాలు అందించటమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని వైఎస్సార్‌సీపీ అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. సింగర్భ పంచాయతీ రచ్చపల్లి, ఎం నిట్టాపుట్టు, శంకులమామిడి, రోలంగిపుట్టు, పూలగొంది, భారం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి గిరిజనుల నుంచి విశేష స్పందన లభించింది. ఆయా గ్రామాల్లో 224 గడపలకు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తిరిగారు. తొలుత గిరిజన సంప్రదాయం ప్రకారం మహిళలు పూలమాలలు వేసి హారతులిచ్చి స్వాగతం పలికారు. గ్రామాల్లో ప్రజా సమస్యలను ఆమె అడిగి తెలుసుకున్నారు. గడప గడపకు తిరిగి ప్రభుత్వం అందిస్తున్న పథకాల అమలు తీరు గురించి ఆరా తీశారు. ఈ క్రమంలో చేయూత పథకం సొమ్ముతో ఆవులు, దూడలు కొనుగోళ్లు చేసినట్టు కొంత మంది మహిళలు చెప్పగా, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లు, చిరు వ్యాపారాలతో ఉపాధి పొందుతున్నట్టు మరికొంతమంది ఆనందం వ్యక్తం చేశారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, పాఠశాల భవనాలకు మరమ్మతులు, ఇళ్లు, తాగునీరు, కౌలురైతు భరోసా, రేషన్‌కార్డులు, గతంలో నిర్మించుకున్న ఇళ్లకు బిల్లులు మంజూరు కాలేదని, పోడు భూములకు హక్కు పత్రాలు, అంగన్‌వాడీ భవనం, కమ్యూనిటీ హాల్, చెక్‌డ్యామ్ నిర్మాణాలు చేపట్టాలని వంటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నిట్టాపుట్టులో పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, పాడేరు ఏఎంసీ చైర్‌పర్సన్ మత్స్యరాస గాయత్రి, సీఐ సత్యనారాయణ, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు ఎస్ రామకృష్ణ, సర్పంచ్‌లు మసాడి కొండమ్మ, ఐసరం హనుమంతరావు, సీదరి కొండబాబు, ఎంపీటీసీలు పి. లక్ష్మి, గబ్బాడి సన్యాసిదొర, ఈవోపీఆర్డీ ఆర్‌వీఎస్ రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మత్స్య కొండంనాయుడు, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు నాగూర్‌బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు గంగరాజు, చిట్టిబాబు, రామకృష్ణ, కళ్యాణ్, కొండబాబు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే పారదర్శక పాలన

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



కించుమండలో ఇంటింటికీ వెళ్లి పథకాలు గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

డుంబ్రిగుడ: అవినీతికి ఆస్కారం లేని పారదర్శక పాలనకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని కించుమండలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన 65 ఇళ్లకు వెళ్లారు. ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, మూడేళ్ల పాలనలో ప్రతి కుటుంబానికి అందిన సంక్షేమ పథకాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే సీఎం ఆశయమన్నారు. ఆ దిశగా అమలు చేస్తున్నారని, ఇవి నిరాటంకంగా కొనసాగాలంటే మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపించాలన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాల అమలులో జాప్యం లేదని, దీనిని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. మన గిరిజన ప్రాంతం అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండానే ఎగర వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ, వైస్ ఎంపీపీలు ఆనంద్, లలిత, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ సోమేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు గణపతి, లీలారాణి, త్రినాథ్, సునీల్, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త సభ్యులతో డ్వాక్రా సంఘాలు

- డీపీఎం పరమేష్



మాట్లాడుతున్న డీపీఎం పరమేష్

రాజవొమ్మంగి: కొత్తగా సభ్యులను గుర్తించి డ్వాక్రా సంఘాల్లో చేర్పించాలని, లేదా కొత్త సంఘాలను ఏర్పాటు చేయాలని సెర్ప్ డీపీఎం పరమేష్ సూచించారు. సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్) పక్షోత్సవాల సందర్భంగా శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో మండల మహిళా సమాఖ్య ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం జరిగింది. ఎస్‌పీఏ రికవరీ, ఎస్‌హెచ్‌జీల ఆడిట్, వీడీవీకే సభ్యుల వాటా ధనం తదతర అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జీల గ్రేడింగ్ తప్పనిసరి అన్నారు. ఎంఎంఎస్ అధ్యక్షురాలు వరలక్ష్మి, ఏపీఎం ఆదినారాయణ, సీసీలు, వీవో లీడర్లు పాల్గొన్నారు.

రూ.1.30 లక్షలతో అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులు



అంగన్‌వాడీ కేంద్రం వద్ద చిన్నారులతో జెడ్పీటీసీ మత్స్యలింగం

హుకుంపేట: జెడ్పీ నిధులు రూ.1.30 లక్షలతో అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులు చేస్తున్నట్లు జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం తెలిపారు. సతకంపట్టు అంగన్‌వాడీ కేంద్రంలో భవన మరమ్మతులకు శుక్రవారం ఆయన చర్యలు తీసుకున్నారు. ఐదు గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాల మరమ్మతులకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ, నాయకులు పాంగి అనిల్, సూరిబాబు, జగదీష్, సిబ్బంది పాల్గొన్నారు.

పక్కాగా ప్లాస్టిక్ నిషేధం అమలు



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ పుష్పలత

చింతపల్లి: ప్లాస్టిక్ నిషేధాన్ని పక్కాగా అమలు చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ దురియా పుష్పలత కోరారు. ఈవోపీఆర్డీ శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం స్థానిక గ్రామ సచివాలయంలో వర్తక సంఘం నాయకులు, సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంత రోజుల్లో గిరిజనులకు అవగాహన కల్పించడం ద్వారా క్రమేపి ప్లాస్టిక్ వినియోగానికి దూరం చేయొచ్చన్నారు. ఈవోపీఆర్డీ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగిస్తే రూ.500 నుంచి రూ.5 వేల వరకు అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు. ఎంపీపీ అనూషా దేవి, జెడ్పీటీసీ బాలయ్య, స్వచ్ఛభారత్ రాష్ట్ర డైరెక్టర్ ఎస్.కె. మీరా, కో ఆప్షన్ సభ్యుడు నాజర్‌వలీ, వర్తక సంఘం నాయకులు బేతాళుడు, గొలుసు జోగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై ఏఎస్పీకి వినతి



ఏఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చింతపల్లి రూరల్: రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీపీ కోరాబు అనూషాదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య కోరారు. శుక్రవారం స్థానిక ఏఎస్పీ ప్రతాప్‌శివ కిశోర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా ద్విచక్ర వాహనాలు వేగంగా వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వేగ నియంత్రణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కోరారు. ఏఎస్పీ సానుకూలంగా స్పందించి ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దురియా పుష్పలత, చౌడుపల్లి ఎంపీటీసీ మీనా కుమారి పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల సలహాలతో సాగు



మాట్లాడుతున్న ఎంపీపీ అనూషా దేవి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ తదితరులు

చింతపల్లి: వ్యవసాయాధికారుల సలహాలతో గిరిజన రైతులు సాగు చేయాలని ఎంపీపీ కోరాబు అనూషా దేవి సూచించారు. స్థానిక ఆర్బీకేలో శుక్రవారం గిరిజన రైతులతో సలహా మండలి సమావేశం నిర్వహించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా గిరిజన రైతులు అన్ని రకాల సేవలు పొందవచ్చన్నారు. స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు పంటలకు ఆశించే తెగుళ్ల నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. మొక్కలు నాటిన దగ్గర నుంచి పంట చేతికి వచ్చే వరకు సలహాలు తీసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, ఎంపీడీవో లాలం సీతయ్య, ఏవో కన్నబాబు, సలహామండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ సలహా మండలి సమావేశం

మారేడుమిల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ సలహా కమిటీ సమావేశం జరిగింది. జెడ్పీటీసీ బాలాజీబాబు, వైస్ ఎంపీపీ రవికుమార్, ఎంపీడీవో వీరకిశోర్, హెచ్‌ఓ రమేష్‌బాబు, ఏఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ఆర్బీకే సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెచ్‌ఓ మాట్లాడుతూ గ్రీన్‌హౌస్ ద్వారా కూరగాయలు పండించుకోవాలన్నారు. వ్యవసాయ యంత్ర పరికరాలు సబ్సిడీపై రైతులకు ఇస్తున్నామన్నారు.

ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని డిమాండ్

రంపచోడవరం: గిరిజన సంక్షేమ శాఖలో ఉపాధ్యాయులతో వాచ్‌మెన్ డ్యూటీ చేయిస్తున్న అధికారుల తీరును ఆదివాసీ హక్కుల వేదిక తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు శుక్రవారం ఆదివాసీ హక్కుల వేదిక కార్యాలయంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొండ్ల వరప్రసాదరావు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ డీడీ ఉత్తర్వుల ప్రకారం ఆశ్రమ పాఠశాలలో వారానికి రెండు రోజులు ఉదయం, రాత్రి స్టడీతోపాటు విద్యార్థులతోపాటు నిద్రించాలని ఆదేశాలు ఇవ్వడాన్ని ఖండించారు. ఉత్తర్వులు తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

చిన్నారులను పాఠశాలకు పంపించండి

అడ్డతీగల: గొండోలు పంచాయతీ సరంపేటలో ఇంటింటికీ వెళ్లి పిల్లల్ని బడికి పంపించాలని ఉపాధ్యాయులు కోరారు. పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని అప్పటి వరకూ పిల్లల్ని పంపించబోమని గ్రామస్తులు ఉపాధ్యాయులకు చెప్పిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ప్రధానోపాధ్యాయిని రమణమ్మ ఆధ్వర్యంలో గ్రామ సచివాలయ సిబ్బందితో కలిసి చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యార్థులు రాకపోవడంతో శుక్రవారం పాఠశాల బోసిపోయింది.

నాడు-నేడు పనులు పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీపీ కృష్ణారెడ్డి

గంగవరం: మనబడి: నాడు-నేడు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి, గడువులోగా పూర్తి చేయాలని ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి అన్నారు. జయనపల్లి రామవరం మండల పరిషత్ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. నిర్మాణ పనుల్లో ఎటువంటి అవకతవకలకు పాల్పడకుండా సక్రమంగా చేపట్టాలన్నారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాల సిబ్బంది ఉన్నారు.

చింతపల్లి ఎక్సైజ్ ఎస్ఐగా రాజేష్

చింతపల్లి: స్థానిక ఎక్సైజ్ ఎస్ఐగా చెండా రాజేష్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ హెచ్‌సీ ఇబ్రహీం ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వహించారు. యలమంచిలి నుంచి రాజేష్‌ను ఇక్కడకు బదిలీ చేయడంతో పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టారు. గంజాయి, సారా నివారణకు పూర్తి స్థాయిలో చర్యలు చేపడతామన్నారు.

చురుగ్గా పట్టభద్రుల ఓటు నమోదు

పాడేరు రూరల్ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరగనున్న ఎన్నికల్లో భాగంగా మండలంలో పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు కురుసా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం గుత్తులపుట్టు గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో పట్టభద్రుల ఓట్ల నమోదు చేపట్టారు. ప్రతి పట్టభద్రుడు ఫారం-18 ద్వారా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. బీజేపీ ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి కురుసా రాజారావు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు లకే భాస్కరరావు, రాష్ట కార్యవర్గ సభ్యుడు మునుముల గోపాలపాత్రుడు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పాంగి మత్స్య కొండబాబు పాల్గొన్నారు.

బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్



మరమ్మతులు గురైన రాయిగెడ్డ బ్రిడ్జిని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

పాడేరు రూరల్: ఇరడాపల్లి పంచాయతీ బొక్కెళ్లు సమీపంలో ఈ.కొత్తూరు బ్రిడ్జిని తక్షణమే మరమ్మతులు చేపట్టాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు కురుసా ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం బీజేపీ నాయకులతో కలిసి బ్రిడ్జిని పరిశీలించారు. ఇటీవల భారీ వర్షాలకు వంతెన పూర్తిగా మరమ్మతులకు గురైందన్నారు. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి కురుసా రాజారావు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు లకే భాస్కర్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోపాలపాత్రుడు పాల్గొన్నారు.

చైల్డ్‌లైన్ ప్రొటెక్షన్ కమిటీ ఏర్పాటు

పాడేరు రూరల్: సర్పంచ్ సాగెని బాబూరావు పడాల్ అధ్యక్షతన గుత్తులపుట్టు అంగన్‌వాడీ కేంద్రంలో చైల్డ్‌లైన్ ప్రొటెక్షన్ పంచాయతీ కమిటీని ఏర్పాటు చేశారు. చైర్మన్‌గా సర్పంచ్, కన్వీనర్‌గా అంగన్‌వాడీ టీచర్, సభ్యులుగా పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, ఆశా కార్యకర్తలు, మహిళా పోలీస్, ఉపాధ్యాయులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, వీఆర్వో కొండమ్మ, మహిళా పోలీసు ఆదర్శిని పాల్గొన్నారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి

ముంచంగిపుట్టు: మండలంలోని ఏనుగురాయి పంచాయతీ పర్తపుట్టు, కిలగాడ పంచాయతీ కోత్తులబైయల్, జర్జుల పంచాయతీ కండిగబీర్ గ్రామాల్లో శుక్రవారం భూముల రీ సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆర్ఐ వి.రవికుమార్ మాట్లాడుతూ మండలంలో పైలట్ ప్రాజెక్టు కింద మూడు గ్రామాల్లో సమగ్ర భూ రీసర్వే చేస్తున్నామన్నారు. రైతులు రెవెన్యూ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఆర్ఐ మోహన్‌రావు, సీనియర్ అసిస్టెంట్ భూపతిపడాల్, వీఆర్వోలు పద్మారావు, కనకరత్నం, మోహన్‌రావు, రాజాశేఖర్, హరినాథ్, సర్వేయర్లు దామోదరం, ఝాన్సీ, రాధిక, సుజాత, లలిత్‌కుమార్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

హక్కుదారులు చనిపోతే మ్యుటేషన్ తప్పనిసరి



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

అడ్డతీగల: భూమి హక్కుదారు చనిపోతే కచ్చితంగా వారి వారసులు సచివాలయాల్లో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ తీసుకుని మ్యుటేషన్ చేయించుకోవాలని తహసీల్దార్ సిహెచ్.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం తిమ్మాపురం గ్రామసభలో ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలపై గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వైస్ ఎంపీపీ కరణం వీరవెంకటసత్యనారాయణ, సర్పంచ్ సోమాలమ్మ పాల్గొన్నారు.

నాడు-నేడు నిధులతో పాఠశాల అభివృద్ధి



నాడు-నేడు పనులకు భూమిపూజ

మోతుగూడెం: పొల్లూరు ఎంపీపీ స్కూల్ వద్ద మరుగుదొడ్ల నిర్మాణానికి సర్పంచ్ ఆకేటి సీత శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నాడు-నేడు ద్వారా విద్యార్థులకు కావాల్సిన అన్ని సదుపాయాలు కల్పిస్తుందన్నారు. ఉప సర్పంచ్ మీనా సుజాత, మీనా కబ్బారావు, పేపకాయల శ్రీను, మడ్డు శివరామకృష్ణ, త్రిమూర్తులు పాల్గొన్నారు.

విశాఖ గర్జనను విజయవంతం చేయాలి

చింతపల్లి రూరల్: మూడు రాజధానులకు మద్దతుగా శనివారం విశాఖపట్నంలో నిర్వహించనున్న గర్జన కార్యక్రమానికి గిరిజనులు స్వచ్ఛందంగా తరలిరావాలని ఎంపీపీ అనూషా దేవి, జెడ్పీటీసీ బాలయ్య, సర్పంచ్ పుష్పలత కోరారు. శుక్రవారం చింతపల్లిలో వారు మాట్లాడుతూ అన్ని జిల్లాలు సమానంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మూడు రాజధానుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు.

పశుసంవర్ధక శాఖ ఉద్యోగుల రక్తదానం




రక్తదానం శిబిరంలో పాల్గొన్న ఉద్యోగులు

పాడేరు రూరల్ : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు, కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం పాడేరు పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 22 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. వారిలో 57 ఏళ్ల మహిళా ఉద్యోగి ఉండటం విశేషం. వీరిని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు అభినందించారు. పాడేరు జిల్లా ఆస్పత్రి సీనియర్ వైద్యుడు కె. కృష్ణారావు, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ సోనారి గంగరాజు, కార్యదర్శి ఈశ్వరరావు, కోశాధికారి టి.అప్పారావు, జిల్లా కో ఆర్డినేటర్ కోటేశ్వరరావు, బ్లడ్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

- పార్టీలోకి ఆహ్వానించిన అరకు ఎమ్మెల్యే పాల్గుణ



టీడీపీ కార్యకర్తలకు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ రూరల్: ప్రభుత్వ సంక్షేమ పాలనకు ఆకర్షితులై టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మాడగ పంచాయతీ మాజీ వైస్ సర్పంచ్ సిర్గం సద్దు, టీడీపీ నాయకులు అప్పలస్వామి, జలంధర్, మల్లేష్, అప్పన్న, దళపతినాయుడుల తోపాటు 30 మంది కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ సీనియర్ నాయకుడు శెట్టి అప్పాలు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో వీరికి ఎమ్మెల్యే పాల్గుణ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఎంపీపీ ఉషారాణి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ సోమేశ్వరి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి శ్రీను, వైస్ ఎంపీపీ రామన్న, ఎంపీటీసీలు శత్రుగున్, భీమరాజు, రాంచందర్ పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరు సౌకర్యం

స్థానిక కొండవీధిలో పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు ఆధ్వర్యంలో తాగునీటి ట్యాంకర్‌ను ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ శుక్రవారం ప్రారంభించారు. 3 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకర్‌ను రూ .2.20 లక్షలతో ఏర్పాటు చేశామన్నారు.

పేదలకు నిత్యావసరాల సరుకుల పంపిణీ

నెస్లే ఇండియా, జేసీ ఇండియా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక క్యాంప్ కార్యాలయం ఆవరణలో వంద మంది నిరుపేదలకు నిత్యావసరాల సరుకులు ఎమ్మెల్యే పాల్గుణ పంపిణీ చేశారు. నెస్లే ఇండియా ప్రతినిధులు వసీం మహమ్మద్, అనిరుధ్, హర్షవర్ధన్‌రెడ్డి, కంన్జ్యూమర్ ప్రతినిధి రఘునాథ్, జిల్లా సమాఖ్య చైర్మన్ మర్రి సత్యనారాయణ పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

హుకుంపేట: అడ్డుమండలో జంపరంగి కొండమ్మ మృతదేహానికి పూలమాల వేసి ఎమ్మెల్యే పాల్గుణ ఘన నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా నిచ్చారు. సర్పంచ్ గుమ్మ శ్యామ్‌సుందర్, జీసీసీ మాజీ చైర్మన్ చెట్టి లక్ష్మణ్, రూడకోట సర్పంచ్ కాతారి సురేష్‌కుమార్ పాల్గొన్నారు.